

# వంశీకృష్ణ

యెలిశెట్టి శంకరరావు

కారు విండోలోనుంచి చూస్తే నాలు గంతస్థుల ఆ భవనం. పూలతోట, ఎత్తైన అశోకచెట్లు, లిల్లీ పూలతో నిండిన ప్రహరీ అన్నీ నాకు నిశ్శబ్దంగా వీడ్కోలు చెప్తున్నట్టున్నాయి.

ఐశ్వర్యాన్ని మిళితం చేసుకున్న రాచరికపు దర్పాలు శూన్యంగా ఉన్న నా నుదట రాజేంద్రభూపతి చేదు జ్ఞాప

కాల్ని సింధూర తిలకంగా దిద్దటానికి విఫలయత్నం చేసి ఓడిపోయి నిస్సహాయంగా నిలబడ్డ ఆ భవనం దగ్గర మౌనంగా సెలవుతీసుకున్నాను.

కారు కళ్యాణపూర్ ఎస్టేట్స్ మట్టి రోడ్డు వదిలేసి తార్రోడు పట్టింది.

మేలిముసుగు సవరించుకుని ప్రక్కన కూర్చున్న నాన్నగారివైపు చూసాను. గంభీరమైన శిలావిగ్రహం. మొహంలో ఏ భావమూ లేదు. నిర్వికారంగా కారు నడుపుతున్నారు.

ఐశ్వర్యపు రథంలా జోరుగా పచ్చటి పొలాలమధ్యనుంచి రామాపురం ఎస్టేట్ వైపు సాగిపోతూంది కారు.

అయిపోయింది జీవితం. అందమైన రంగుల చిత్రం మసకబారిపోయింది.

"నీ జీవితం రంగుల హరివిల్లులా ఉండాలి బిందూ!" ఆరాధనగా అనేవాడు వంశీకృష్ణ.

రంగుల హరివిల్లులానే కొన్ని క్షణాలు మెరిసిన చిత్రమైన మంచు బొమ్మ కరిగి శూన్యంగా మారిపోయింది.

"స్వచ్ఛమైన నీ ప్రార్థనలు నింగిలోని ఏ దేవతల్నీ కరిగించలేకపోయాయి. ఏ దైవం నా సౌభాగ్యాన్ని కాపాడలేదు. సృష్టి జీవితానికి ఓ చేదు నిర్వచనం చెప్పింది వంశీ!" నా మనసు మౌనంగా రోదిస్తోంది.

కన్నీటి తెర కప్పిన కళ్ళకు అస్పష్టంగా మనోనేత్రంలో కదలాడుతున్న కృష్ణ జ్ఞాపకాలు. కృష్ణ.... వంశీకృష్ణ!

* * *

పసిపాపగా ఉన్నప్పట్నుంచి అయా చేతుల్లో పెంచబడ్డ దురదృష్టవంతురాల్ని నేను. ఊరికి దూరంగా ఉన్న ఆకాశ హర్మ్యంలో అపురూపంగా మట్టిబొమ్మలా పెంచబడ్డాను.

అయిదారేళ్ళ ప్రాయంలో ఎందుకో అల్లరిపెడుతుంటే అయా నన్ను ఎత్తుకుని మెట్టమొదటిసారిగా తోటలోకి తీసుకువెళ్ళింది. కొన్నిఎకరాల విస్తీర్ణంలో పూలతోట. గులాబీ, జాస్మిన్, చందనం, పోకచెట్లు.

పచ్చగులాబీకి అంట్లు కడుతున్నాడు తోటమాలి. అ ప్రక్కనే అయిదారేళ్ళ అబ్బాయి. నల్లగా ఉన్నాడు. వొంటిమీద నిక్కరు చొక్కా చిరిగి ఉన్నాయి. జుట్టంతా రేగి ఉంది.

"ఏం రాజయ్యా! నీ మనవడిక్కూడా తోటపని నేర్పుతున్నావా ఇప్పట్నించే?" నవ్వుతూ తోటమాలిని పలుకరించింది అయా.

తలెత్తి చూసి చిన్నగా నవ్వాడు తోటమాలి.

అయా నన్నక్కడ వదిలేసి తోటమాలితో కబుర్లలో పడింది.

నెమ్మదిగా అక్కణ్ణుంచి జారుకుని తోటలోకి పరుగుతీసాడు నల్లబ్బాయి. వెనుకనే నడిచాను నేను.

దూరంగా పాలరాతి చప్టా దగ్గర

అగాడు నల్లబ్బాయి. కుతూహలంగా కళ్లు విప్పార్చుకుని నన్నే చూస్తున్నాడు. నా కెందుకో గర్వంగా అనిపించింది.

"అమ్మాయిగారూ! మీరు చదువు కుంటున్నారా?" కొంచెం సేపయ్యాక అడిగాడు.

"ఊఁ!"

"ఎక్కడ? పట్నంలోనా?"

"ఊహుఁ! టీచర్లు మా ఇంటికే వస్తారు" చెప్పాన్నేను.

నల్లబ్బాయి ఏమీ మాట్లాడలేదు.

"మరి నువ్వు చదువుకుంటున్నావా?" అడిగాన్నేను.

"ఊఁ! గుళ్లో పూజారయ్యగారు అ, ఆలు నేర్పేరు. పెద్ద బాలశిక్ష, భాగవతం, భారతం అన్నీ చెప్తానన్నారు." గర్వంగా చెప్పాడు వంశీ!

ఎందుకో నల్లబ్బాయి కూడా చదువు కుంటుండటం నాకు నచ్చలేదు. నెమ్మదిగా రెండడుగులువేసి గులాబీ మొక్కల మీద వాలిన తూనీగల్ని పట్టుకోబోయాను.

"తప్పు!" నెమ్మదిగా అన్నాడు నల్లబ్బాయి.

"ఏం?" నిర్లక్ష్యంగా అడిగాన్నేను.

"పాపం? వాటికి నొప్పెడుతుంది. ఏడుస్తాయి" కళ్లు పెద్దవిచేసి చెప్పాడు.

"పోనియ్! నాకేం! నా కిష్టం" మళ్లీ తూనీగల్ని పట్టుకొనే ప్రయత్నం చేస్తుంటే-

"దేవుడు నీ కళ్లు తీసేస్తాడులే!" భయపెడుతూ చెప్పాడు నల్లబ్బాయి.

నేను వినిపించుకోలేదు. తూనీగలు నాకు దొరక్కుండా తప్పించుకుంటున్నాయి.

నల్లబ్బాయి కదిలి రెండు తూనీగల్ని పట్టుకుని తెచ్చి నా కిచ్చాడు.

"ఏం పాపం! నీకు భయం లేదూ! దేవుడు నిన్నేం చెయ్యడా?" వెక్కిరిస్తూ అడిగాను.

"అయితే ఏం! నీ కివంటే ఇష్టంగా!" నెమ్మదిగా అన్నాడు నల్లబ్బాయి.

"చిన్నమ్మాయిగారూ! చీకటిపడుతోంది. పోదాం రండి" దూరం నుంచి అయా పిలుపు వినిపించింది.

నేను ఆయా దగ్గరికి పరిగెట్టాను.

వెనక నుంచి నల్లబ్బాయి కేక వినిపించింది. "మళ్ళీ ఎప్పుడొస్తారు అమ్మాయిగారూ!"

"రేపో! ఎల్లుండో!"

చెప్పేసి వెళ్ళిపోయాను.

* * *

"అమ్మాయిగారూ! మామిడికాయలు కోసుకుని తిందామా?" నెమ్మదిగా అడిగాడు నల్లబ్బాయి.

సరేనన్నట్టు తలూపాను.

గున్నమామిడి చెట్టు ఎక్కి నాలుగు కాయలు తెంపి తెచ్చి నా కిచ్చాడు నల్లబ్బాయి.

"మీ రిక్కడే కూర్చోండి. ఇప్పుడే వచ్చేస్తా నమ్మాయిగారు" అని చెప్పి వడి

వడిగా వాళ్ల గుడిసెలోకి వెళ్లి మళ్లీ వచ్చాడు నల్లబ్బాయి. చిన్న కాగితం పొట్లంలో ఉప్పూ కారం తెచ్చి మామిడి కాయలు ముక్కలుచేసి నా ముందుంచాడు. "తినండమ్మాయిగారూ బావుంటాయి" మెరిసే కళ్లతో చెప్పాడు నల్లబ్బాయి.

తినటానికి సిద్ధపడుతుంటే ఎవరో చెయ్యి విదిలించి కొట్టారు. ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూసాను.

ఆయా! కోపం కక్కుతోంది. ఆయా చెయ్యి నల్లబ్బాయి ఒంటిమీద నాట్యం చేస్తోంది. నా ముందున్న మామిడికాయ ముక్కలు, కారం నల్లబ్బాయి మొకంమీద విసిరేసింది ఆయా. భయంభయంగా కళ్లు తిప్పి చూస్తున్న నల్లబ్బాయి కెవ్వుమన్నాడు.

"దొంగవెధవా! అమ్మాయిగారిచేత అడ్డమయిన గడ్డీ తినిపిస్తావా? ఈసారి ఇలాంటి పిచ్చివేషాలేస్తే వీపు ఛీరేస్తాను."

అరిచి చెప్పి నన్ను లోపలికి తీసుకు వెళ్లిపోయి బ్రెడ్‌టోస్ట్ తినిపించిందాయా. రోజ్‌మిల్క్ తాగుతుంటే బేలగా చూస్తున్న నల్లబ్బాయి మొకం కళ్ల ముందు కదలాడింది. సహించక పోయినా గబగబా తాగేసి మళ్లీ ఎవరూ చూడకుండా తోటలోకి పరిగెత్తాను.

నల్లబ్బాయి ఇంకా అక్కడే గున్న మామిడి చెట్టుక్రిందే నిలబడి ఉన్నాడు. బుగ్గలమీద నీటి చారికలు!

"బాధగా ఉందా? కళ్లింకా మండుతున్నాయా నల్లబ్బాయ్?"

లేదన్నట్టు తలూపాడు.

"మరెందు కేడుస్తున్నావ్?"

"నన్నొదిలేసి నువ్వెళ్లిపోయావుగా! అందుకే ఏడుపొచ్చింది!" వెక్కిళ్ల మధ్య చెప్పాడు నల్లబ్బాయి.

"అందుకే వచ్చేసాగా!" ఓదార్పుగా అన్నాను.

"ఇంకేడవనులే!" చేత్తో బుగ్గలమీద జారుతున్న కన్నీళ్లు తుడుచుకుంటూ అన్నాడు నల్లబ్బాయి.

* * *

నా పదిహేనవ ఏట నన్ను టౌన్లో కాలేజీలో చేర్పించారు. రోజూ గుర్రపు బగ్గీలో టౌనుకు వెళుతుండేదాన్ని. ఏటి ఒడ్డున కొబ్బరితోటల మధ్యగా గుర్రపు బగ్గీ పరిగెడుతుంటే పరిగెట్టుకు వస్తున్న నల్లబ్బాయి....

చేతిలో తెల్లగులాబీ!

బండి పరిగెడుతుండే దాంతోపాటే నల్లబ్బాయి పరిగెడుతూనే ఉన్నాడు.

గులాబీ నా చేతి కందించాడు.

"ఎందుకు రోజూ ఇలా శ్రమపడతావు. సాయింత్రం ఇంటికి తిరిగివచ్చేటప్పుడు తీసుకుంటాను కదా!" మందలిస్తూ అన్నాను.

"ఉహుఁ! తొలిసంధ్యవేళ అర

విచ్చిన ఈ గులాబీ తన ప్రాధాన్య శూన్యతకి వెలాతెలాబోతుంటే మీ చేతుల్లో పెట్టి దాన్ని ఊరడిద్దామని" గులాబీ వంక చూసి చెప్పి ఆగిపోయాడు నల్లబ్బాయి.

ప్రతీరోజూ గులాబీ అందుకోవటం నాకో తియ్యని అనుభవం. అస్పష్టంగా క్రమ్ముకునే ఆలోచనల తెమ్మెర భావ స్వారూప్యంలేని ఆలోచనల్తో నిండిన ఆ క్షణం ఎద కోరుకునే స్పందనా రవళి. గుర్రపు బగ్గీ ముందుకు సాగిపోతుంటే తదేకంగా నా వైపే చూస్తుండిపోయిన నల్లబ్బాయి కళ్లలో మెరుపుకి కారణం చాలా త్వరలోనే అర్థమయింది నాకు.

* * *

"తేనె పిండి తెస్తాను. మీ రిక్కడే ఉండండి!"

పాలరాతి చప్టా ప్రక్కన నన్ను కూర్చోబెట్టి కాగడామంట చేత్తో పట్టుకుని వడివడిగా గున్నమామిడి చెట్టెక్కాడు నల్లబ్బాయి. కుతూహలంగా చూస్తున్నా న్నేను. కొంచెం దూరంగా కొమ్మపై నిలబడి తేనెపట్టు ఉన్నవైపు కాగడా మంటను పోనిచ్చాడు. వేడికి తేనెటీగలు కదిలాయి. హఠాత్తుగా నల్లబ్బాయి చేతి లోని కాగడా జారిపోయింది. గుంపుగా లేచిన తేనెటీగలు నల్లబ్బాయిమీద దాడిచేసి తోటంతా చెదిరిపోయాయి. రెండు చేతుల్తోనూ మొహం కప్పు కున్నాడు నల్లబ్బాయి.

ఓ తేనెటీగ నా పాదంమీద కాటు వేసింది.

"బాధ! ప్రాణాలు తోడేస్తున్నట్టుంది." కెవ్వుమని అరిచాన్నేను.

చటుక్కున చెట్టుకొమ్మమీదనుంచి కిందికి గెంతాడు.

"ఏమయిందమ్మాయిగారు" గాభరాగా అడిగాడు నల్లబ్బాయి.

"తే నె టీ గ కుట్టింది." పాదం చూపించాను.

పొదలవైపు పరిగెత్తి ఏవో ఆకులు కోసి తెచ్చాడు నల్లబ్బాయి. నా ముందు మోకాళ్లపైన కూర్చుని నా పాదాన్ని ఎత్తి అతని తొడమీద పెట్టుకుని ఆకు పసరు పూస్తుంటే అప్రయత్నంగా నా వొళ్లు జలదరించింది. ఎదలో రేగిన తియ్యని సంచలనం, మనసులో ఆవరించి పులకరింపజేసిన మౌనరాగం. అస్ప ష్టంగా ఆ క్షణంలో అతనిపై జనించిన అవ్యాజానురాగం తదేకంగా అతనివైపే చూస్తుండిపోయాను.

దట్టంగా పెరిగి వంకీలు తిరిగిన జుట్టు నుదిటిమీద పడుతోంది. ఆచ్ఛాదన లేని వక్షస్థలం. బిగుతైన కండలు. మొరటుగా ఉన్న చేతివేళ్ళలో మృదువుగా పాదంపైన పసరు పూస్తున్నాడు. నీలి రంగు కళ్లు ఆందోళనగా ఉన్నాయి.

"అమ్మాయిగారూ! ఎలా ఉంది?" అనునయంగా అడిగిన నల్లబ్బాయి ప్రశ్నతో ఉలిక్కిపడి ఊహల్లోంచి తేరుకున్నాను.

"పరవాలేదు. కొంచెం తగ్గినట్టుంది." అన్యమనస్కంగా చెప్పాను.

"ఇంటికి వెళ్లి కొంచెంసేపు నిద్ర పొందమ్మాయిగారు. నేనే పాపిష్టివాడ్ని నా మూలంగానే ఇలా జరిగింది." తనని తాను నిందించుకుంటూ అంటున్న నల్లబ్బాయిని మరోమారు స్నేహపూర్వకంగా చూసి ఇంటివైపు నడిచాను.

ఇంటికెళ్లిన తర్వాత జాగృదావస్థ లోకి వచ్చాను.

తేనెటీగలు దాడిచేసిన నల్లబ్బాయి గుర్తొచ్చాడు.

తనకి ఎలా ఉందనయినా అడగలేదు నేను.

గిరుక్కున వెనక్కి తిరిగి తోటలోకి వచ్చాను. అక్కడ నల్లబ్బాయి లేడు.

నామీద నాకే కోపం వచ్చింది.

* * *

ఆ రాత్రంతా నిద్రపట్టలేదు. భావరహితంగా వ్యక్తావ్యక్త ఘర్షణలో మనసును పీడిస్తున్న మూగవేదన. ఆలోచనల్నిండా నల్లబ్బాయి. ఆరాధనగా నన్ను వెంటాడే అతని నీలి కళ్లలోని కాంతి. చాలా రాత్రయ్యాక కలతనిద్ర పట్టింది.

* * *

టౌను నుంచి నా స్నేహితురాళ్లంతా మా ఇంటికి వచ్చారు. సాయంత్రం అందర్నీ తోటలోకి తీసుకువెళ్లాను.

సంబరంగా తోటంతా కలియతిరుగుతున్నారంతా. దూరంగా గులాబీ తోటకు నీరు మళ్లిస్తున్నాడు నల్లబ్బాయి.

"తోట చాలా బావుందే! అబ్బ! ఎన్ని పువ్వులో! ఈ చందనంచెట్లు చూసావా!"

మాట్లాడుకుంటూ నెమ్మదిగా నల్లబ్బాయి ఉన్నచోటుకి చేరుకున్నాం అందరము. పార బుజాన తగిలించుకుని నీరు ఒక్కొక్క మొక్కకే మళ్లిస్తున్నాడు నల్లబ్బాయి.

"బిందూ! ఎవరే ఈ అడవిరాముడు!" నవ్వుతూ అడిగిందొక స్నేహితురాలు.

"మాలి!" నెమ్మదిగా చెప్పాన్నేను.

"అబ్బా! నల్లనివాడు చీకట్లో కనిపించటం కష్టమే. ఎంచక్కా మన ఊరు పట్టుకొచ్చేయగూడదే జూలో ఉంచేద్దాం."

ఘొల్లున నవ్వులు.

చటుక్కున తలెత్తి చూసాడు నల్లబ్బాయి.

తడిగా మెరిసిన పెద్దకళ్లు.

"అబ్బో! పద్మనయనమ్ములవాడే!" వెక్కిరింతగా అన్నారెవరో.


"పదండే! ఈ అందాల చంద్రుడ్ని చూసుకుంటూ ఇంకా ఎంతసేపు. బాగా ఆకలివేస్తోంది." అందరూ వడివడిగా ఇంటివైపు వెళ్లిపోయారు.

చీకటి కమ్ముకొంటోంది.

నెమ్మదిగా లేచి నిలబడ్డాడు నల్లబ్బాయి. మొకంలో ప్రతిఫలిస్తున్న బాధ.

"ఏమీ అనుకోకు! వాళ్లు మూర్ఖులు"

స్త్రీలకు ఆస్తి హక్కు !




నెమ్మదిగా అన్నాను.

"ఫరవాలేదులెండి. చీకటిలో చీకటి ఏమనుకుంటుంది. చీకటి మీకు కనిపించ దేమో. మీరు కూడా వెళ్లిపోండి" పేలవంగా అన్నాడు.

మొట్టమొదటిసారిగా అతని సమక్షంలో నేను పడ్డ మౌనబాధ. ఎద లోతుల్లోంచి జాలి ఉప్పెనలా వచ్చింది. ఆ క్షణం అతన్ని నా గుండెల కత్తుకుని సేదతీర్చి ఊరడించాలనే కాంక్షని చాలా కష్టంమీద నిగ్రహించుకున్నాను.

"వంశీకృష్ణా!" నెమ్మదిగా పిల్చాను.

ఆశ్చర్యంగా నావైపు చూసాడు నల్లబ్బాయి.

"ఇకమీదట ఇంకెప్పుడూ నా జీవితంలో ఒంటరిగా తప్ప మరెవరితోనూ కలసి ఈ తోటకు రాను." నా స్వరం నాకే వింతగా తోచింది.

తదేకంగా నావైపు చూస్తున్నాడు వంశీ. జరుగుతున్నదాన్ని నమ్మలేనట్లు ఆశ్చర్యాన్ని ప్రతిఫలిస్తున్న అతని కళ్లు చిత్రంగా మెరుస్తున్నాయి.

"నిజం వంశీ! ఎందుకో! నిన్నెవరైనా హేళనగా మాట్లాడితే నాకు ఎంత బాధగా ఉంటుంది. ఆ నిజం నాకిప్పుడే అర్థమయ్యింది." బరువుగా నా స్వరంలోంచి వస్తోన్న మాటల్ని వింటున్న వంశీ ముఖంలో వెల్లి విరిసిన ఆనందం.

"మనం ఈ రోజునుంచి మంచి స్నేహితులం. మన స్నేహానికి గుర్తుగా ఈ మాలతీలత నాటుదాం, రా!" పిల్చాను నేను.

నేను మొక్కను నాటితే అతను నీరు పోసాడు. ఆ సాయం సంధ్యలో ఓ పవిత్రమైన స్నేహమాధుర్యం జీవం పోసుకుంది.

ఎన్నెన్ని రోజులు. ఎన్నెన్ని కబుర్లు. రెండు గుండెల్లోని స్వచ్ఛమైన స్నేహం. ప్రేమవాహినిగా ప్రవహిస్తుంటే ఆ మాలతీలత పెరిగి పెద్దదయింది.

ఆ మాలతీలత వాడిపోవటం కూడా నా కళ్ళతోనే చూడవలసి వస్తుందని అప్పుడు నేను ఊహించలేదు.

* * *

వంశీ స్వచ్ఛమైన, నిర్మలమైన మనస్సు నన్నాకట్టుకుంది. ఎందుకో పదేపదే అతన్ని చూడాలని, గంభీరంగా మంద్రస్వరంలా వినిపించే అతని స్వరం వినాలని, కాంతిని వెదజల్లే అతని కళ్ళలోకి తన్మయంగా ఈ జన్మంతా గడపాలని ఎందుకో ఎదలోని కోరిక.

వంశీకృష్ణ! ఏముందీ నల్లబ్బాయిలో .... మనసు వేసే ప్రశ్న!

ప్రేమించే మనసుకి— ఎదను పెన వేసుకున్న అనురాగవల్లరికి ఎప్పటికీ దొరకని సమాధానం ! !

* * *

సంధ్యాదేవి భానుడి కిరణాలు నుదుట సింధూర తిలకంగా దిద్దుకుని హాయ లొలకబోస్తోంది.

విప్పారిన కళ్ళతో పరవశంగా నా వైపే చూస్తున్నాడు వంశీ! అనురాగ రేఖలు శరీరాన్ని స్పృశిస్తున్న పులకింత.

"ఏంటలా చూస్తున్నావ్?"

"నిజం చెప్పనా?" నెమ్మదిగా అన్నాడు.

"ఊఁ!"

"సంధ్యాదేవి లజ్జాదాహంతో మేలి ముసుగు సవరించుకుని నా ముందు నిలిచిందా! ప్రకృతికన్య హాయలొలికిస్తుందా! దూరంగా పారుతున్న సెలయేటి సంగీతం స్త్రీ రూపం దాల్చి నా ముందు నిలిచిందా? అన్న సందేహంలో పడ్డాను" తన్మయంగా అన్నాడు వంశీ.

సిగ్గుతో నా తల వాలిపోయింది.

"కృష్ణా!" నెమ్మదిగా పిల్చాను.

"ఊఁ!"

"ఎల్లుండి నా పుట్టినరోజు."

"ఊఁ!" ఎందుకో ముభావంగా ఉండిపోయాడు వంశీ!

* * *

రెండ్రోజులు వంశీ నాకు కనిపించలేదు. ఆశగా నిరీక్షించిన నాకు ఎందుకో అశాంతిగా అనిపించింది. పుట్టినరోజు నాడు సాయింత్రం అవుతుండగా పార్టీకి వచ్చిన అతిధుల బారినుంచి తప్పుకుని మెల్లిగా తోటలోకి వచ్చేసాను. చీకటి పడుతోంది. పక్షుల కిలకిలారావాలు విని

పిస్తున్నాయి.

ఏటిఒడ్డున నీటి అలల్ని చూస్తూ కూర్చున్నాడు వంశీ. అవతలి ఒడ్డున ఎత్తైన కొండలు మనిషి అస్థిత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి. అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్లి వంశీ పక్కన కూర్చున్నాను. దూరంగా బల్లకట్టు పల్లె ప్రజల్ని ఏటి అవతలి ఒడ్డుకు తీసుకు పోతోంది. సరుగుడు తోటలోంచి వీస్తున్న పిల్లగాలి ఏటిఅలల్ని స్పృశిస్తూ అలల్ని రేకెత్తిస్తోంది.

"ఎక్కడికి వెళ్లిపోయావ్ వంశీ రెండ్రోజులుగా కనిపించలేదు?" ప్రశ్నించాను.

ఏమీ మాట్లాడలేదు వంశీ. రెండు క్షణాలు నా వంక పరిశీలనగా చూసి తన చేతిలోని ఏదో ప్యాకట్టు విప్పాడు. కుతూహలంగా చూసాన్నేను.

ఎర్ర మట్టి గాజులు.

నా చేతికి అందిస్తూ అన్నాడు వంశీ.

"నీ అందమైన చేతులకి పేలవంగానే ఉంటాయి బిందూ! అయినా ఒకసారయినా వేసుకో" నెమ్మదిగా అని తల దించుకున్నాడు వంశీ. నా మనసులో ఎందుకో సన్నని బాధ.

అపురూపంగా అతను ఇచ్చిన గాజులు అందుకుని అన్నాను. "ప్రతీ క్షణం నీ పేదరికాన్ని గుర్తుచేసుకోవద్దు వంశీ!"

కృతజ్ఞతగా నావైపు చూసాడు వంశీ.

* * *

నాన్నగారు నాకు సంబంధాలు చూడటం మొదలుపెట్టారు. జమీందార్ల వంశం పాతికలక్షలకు పైగా ఆస్తులు ఎవరెవరి కున్నాయో వెతుకుతున్నారు. జమీందార్ల వంశంలోని అమ్మాయి అంతకు మించి ఇంకేమీ కోరుకోదని ఆయన ఉద్దేశ్యం.

మా రాచరికపు సాంప్రదాయం వెనుక, రాతిగోడల భవంతుల వెనక ఎలాంటి కరుకు గుండెలుంటాయో, ఎటువంటి రాతిమనుషులుంటారో నాకు బాగా తెలుసు. ఐశ్వర్యపు మదం పోతపోసిన ఆ మనసుల్లో మార్దవం అనేది వెతికినా కబడుతుందనేదీ నాకు సందేహమే!

నా మనసు, ఆత్మ వంశీ చుట్టూ పెనవేసుకున్నాయి. ఈ జన్మంతా అతని సమక్షంలో గడపాలని, కాంతిని వెదజల్లే అ కళ్లలోకి చూస్తూ ఎన్ని జన్మలయినా గడిపేయాలని.... అకాంక్ష.

సంధ్యచీకట్లు ముసురుకుంటున్న సమయాన ఏటిఒడ్డున నాలోని కోరికల్ని వంశీ నిర్దాక్షిణ్యంగా అణగద్రొక్కిన వంశీ మాటల్ని బహుశా ఈ జీవిత కాలం మరిచిపోలేను.

మౌనంగా కూర్చుని ఏటిఒడ్డున నీటిపువ్వుల్ని తదేకంగా చూస్తున్నాడు వంశీ.

"వంశీ! ప్రేమంటే ఏమిటి?"

ముసురుకుంటున్న చీకటిలో అతని పలువరస చిత్రంగా మెరిసింది.

"రెండు మనసుల్ని ఏకకాలంలో ఆవరించుకునే మాధుర్యం, విషాదం." ఎక్కడో మనసు మారుమూలలోని పొరని తాకే విషాదపూరిత సమాధానం.

"వంశీ! నువ్వు నన్ను ప్రేమిస్తున్నావా?" బిడియంగా అడిగాను.

"నా ప్రాణాల్ని పారాణిగా నీ పాదాలకు పుయ్యనా బిందూ" ఆరాధనగా చూస్తూ అన్నాడు వంశీ.

చాలా సేపు చుట్టుముట్టిన మౌనం.

"వంశీ! నా నుంచి నువ్వేమీ కోరుకోవటంలేదా? స్వరం కంపిస్తుండగా అడిగాన్నేను.

"బిందూ! నీ పరిచయం స్నేహం నేను కలలోనైనా ఊహించటం సాహసమే. నీ ప్రేమను పొందటమే నా చీకటి జీవితానికో పెద్ద వరం. అంతకు మించి ఇంకేం ఆశించగలను బిందూ." అతని స్వరం నిష్కల్మషంగా పలికింది. నాకాలి అందియలు వంశీ చేతివేళ్ళ తాకిడికి లయబద్ధంగా చప్పుడు చేస్తున్నాయి.

ఏదో విషాదం నన్ను కమ్ముకొంది. ముప్పిరిగొన్న భయం. నేను నిర్మించుకున్న ఆశాసౌధాలు కూలిపోయి మానసికంగా ఒంటరిగామిగిలిపోతాననేఆవేదన.

"వంశీ! నన్ను పెళ్ళి చేసుకోలేవా" కంపితస్వరంతో అడిగాను.

సూటిగా నా కళ్ళలోకి చూసి అన్నాడు వంశీ.

"నేను మీ పనిమనిషి వడ్డించిన అన్నం తెచ్చుకొని మీ పశువుల పాకలో ఓ మూలన కూర్చుని తింటాను బిందూ!"

నా మనసు చివుక్కుమంది.

"మన మధ్య అంతరాల్ని ఎత్తి చూపిస్తున్నావా వంశీ?" హీనస్వరంతో ప్రశ్నించాను.

"లేదు బిందూ! నిజాన్ని విప్పి చూపిస్తున్నాను. మనసులో ఎంత స్వచ్ఛంగా స్వతంత్రంగా ఉన్నప్పటికీ మనచుట్టూ ఉన్న సంఘానికి, పరిస్థితులకి మనం ఎప్పటికీ బానిసలమే- బిందూ! నువ్వు చాలా అంతస్థులు దిగివచ్చి చెయ్యి అందించినా ఆ చెయ్యి అందుకోలేని నిస్సహాయుణ్ణి. నన్ను క్షమించగలవా బిందూ!"

చీకట్లో వంశీ కళ్ళు తడిగా మెరిసాయి.

"వంశీ! నిన్ను నా అంతస్థులోకి తీసుకురావటానికి ప్రయత్నిస్తాను" పట్టుదలగా అన్నాను,

"మనిషి ఊహకు వాస్తవానికి ఎక్కడా పొంతన కుదరకపోవటమనేది మానవ జీవితానికి ఓ శాపం బిందూ! నాబోటి ఓ అమాయకుడ్ని అందలమెక్కించాలని పిచ్చి ప్రయత్నాలు చెయ్యకు. ఓడిపోతావు" విరక్తిగా నవ్వుతూ అన్నాడు వంశీ!

అప్పటికే నేనో నిర్ణయానికి వచ్చేసాను.

* * *

నాన్నగారి కళ్ళు ఆగ్రహాన్ని కక్కుతున్నాయి.

వంశీ నా కిచ్చిన మట్టిగాజులు ముక్కలయిపోయి నేలమీద చెదిరిపోయాయి. నాన్నగారు కొట్టిన చెంప దెబ్బ నన్ను బాధించటంలేదు. వంశీని గురించి నీచంగా మాట్లాడుతుంటే బాధ కల్గింది.

"బిందూ! వాడు మన ముంగిట ఎంగిలిమెతుకులు తినే కుక్క. ఆ కుక్కని అందలమెక్కిస్తా ననటానికి నీ కెంత ధైర్యం...." ఆయన మాటల్లోని హేళనకి నా గుండెని ఎవరో మెలి తిప్పినట్టయింది.

"దివాన్జీ!" పిల్చారు నాన్నగారు. ఆ పిలుపులోని కర్కశత్వానికి భవంతి దద్దరిల్లింది. వణికిపోతూ వచ్చి నాన్నగారి ముందు నిలిచారు దివాన్జీ. ఆయనకు ఏం ఆజ్ఞాపిస్తారో ఊహించాక ఇక అక్కడ ఉండలేకపోయాను.

మేడమీదనుంచి చూస్తుంటే మా స్నేహలత ప్రక్కనే పాలరాతి స్థంభానికి వంశీని కట్టేసి కొరడాతో కొడుతున్నాడు దివాన్జీ. వంశీ వొళ్లంతా రక్తపు మరకలు. చర్మం కొన్ని చోట్ల తొలగిపోయింది. స్పృహతప్పిపోయాడు వంశీ.

ఆయా ఒడిలో తలపెట్టుకుని ఆ రాత్రంతా ఏడుస్తూనే ఉన్నాను. ఆ వారంలోనే రాజేంద్రభూపతితో నా పెళ్లి నిశ్చయమయింది. ఏదో తెలియని నిర్లిప్తతా భావంతోపాటు వంశీని ఒక్కసారి చూడాలని హృదయంలో ఉవ్వెళ్లూరుతున్న కోరిక. రక్తసిక్తమయిన అతని దేహం కళ్లముందు కదలాడుతుంటే ఒక్కసారి వంశీని చూపించమని ఆయాని ప్రాధేయపడ్డాను.

నా దుఃఖాన్ని చూసి కరిగిపోయింది ఆయా. నా కోసం సాహసమే చేసింది. అర్ధరాత్రి దాటిన తర్వాత ఏటి ఒడ్డునున్న వంశీ పూరిగుడిసెకి తీసుకువెళ్లి తాను బయట నిలిచిపోయిం దాయా.

నా అడుగుల చప్పుడు విని తలెత్తి చూసాడు వంశీ.

"బిందూ!" నమ్మలేనట్లు పలికాడు. అతని కళ్లలో ఆనందం, ఆశ్చర్యం దోబూచులాడాయి.

నెమ్మదిగా లేచివచ్చి నులకమంచం వాల్చాడు.

"కూర్చో బిందూ!" పరవశంగా అన్నాడు.

చాలాసేపు ఇద్దరం మౌనంగా ఉండిపోయాం.

"వంశీ! నాకు పెళ్లి నిశ్చయమయింది తెలుసా!" నెమ్మదిగా అడిగాను. తెలుసు అన్నట్లు తలూపాడు వంశీ.

"నా పెళ్లి కుదరటం సంతోషంగా ఉందా వంశీ!" బాధగా అడిగాను.

"చాలా సంతోషంగా ఉంది బిందూ! ఎంత సంతోషంగా ఉందంటే ఈ ఆనందాన్ని భరించలేక నా గుండె



ఆగిపోతే బాగుణ్ణనిపిస్తోంది." చీకట్లోకి చూస్తూ చెప్తున్న వంశీ స్వరం రుద్ధ మయింది.

నాలో ఎక్కడో నరాలు తెగి పోయాయి.

తదేకంగా అతని కళ్ళలోకి చూస్తూ ఉండిపోయాను. నెమ్మదిగా వంశీ పెద వులు విచ్చుకున్నాయి.

"బిందూ! ఈ క్షణంలో నిన్ను లేవ దీసుకు వెళ్లిపోవాలని ఎందుకో దుర్బుద్ధి పుడుతోంది. కానీ నీ పుట్టినరోజున కేవలం నీకు మట్టిగాజులు కొనటం కోసం నేను రెండు రోజులు పూర్తిగా అడివిలో తిరిగి కట్టెలుకొట్టి చుట్టు పక్కల ఊర్లలో అమ్ముకొస్తేనే గాని నీకు గాజులు కొనలేకపోయానని గుర్తొస్తే నా దరిద్రంమీద నాకే అస హ్యం వేస్తోంది. బిందూ నేను కేవలం పిరికివాణ్ణే కాదు. స్వార్థిని కూడా. నా దేవత కష్టాలనీడ చూడకూడదు. నా

పుష్యరాగం మట్టిలో కలిసిపోకూడదు. బిందూ! నన్ను అర్థంచేసుకోగలుగుతున్నావా!" వంశీ స్వరం జీరగా పలుకుతోంది.

నా రక్తంలో జీర్ణించుకుపోయిన కుటుంబగౌరవం, రాచరికపు సంప్రదాయాలు నా ప్రేమని జయిస్తే కన్నీళ్ల రూపంలో ఓటమి బయల్పడింది.

"ప్రేమంటే ఎడబాటేనా వంశీ!" తడబడుతూ అడిగాను.

వంశీ కళ్లు గాజుకళ్లలా మెరుస్తూ శూన్యంలోకి చూస్తున్నాయి. చాలా నిర్లిప్తంగా అన్నాడు వంశీ.

"ఎవరన్నారు బిందూ! ఈ ఏటిమీదుగా వచ్చే గాలి నీ శరీరాన్ని స్పృశించి వచ్చి నా శరీరాన్ని సోకుతుంది. ఆ తోట మీదుగా వచ్చే గాలి నీ ఆత్మలోని ఆనందాన్ని నాకు పంచి ఇస్తుంది. ఇక ఎడబాటన్న ప్రసక్తి ఏముంది?"

కన్నీళ్లు నా బుగ్గలమీదుగా జారుతుంటే దోసిలి ఒడ్డి అన్నాడు వంశీ.

"స్వచ్ఛమైన ముత్యాల్లాంటి నీ కంటి కొలకలు కల్మషమైన ఈ భూమ్మీద పడనీయను బిందూ!"

కన్నీళ్లు నిండిన అతని కళ్లలో అభ్యర్థనకి చీకటి నవ్వింది.

* * *

"భౌతికంగా నీ సుఖం కోసం, సౌభాగ్యం కోసం నింగిలోని దేవతలందర్నీ ప్రార్థిస్తాను బిందూ." నిర్మలంగా చెప్తున్న వంశీ కళ్లలో నీటిబొట్లు చూడలేక తల దించుకున్నాను.

ఈ నల్లబ్బాయిని మనసులో నించి తుడిచేసి మరో పాలరాతి బొమ్మని మనసులో ప్రతిష్ఠించుకోవాలి! "భగవంతుడా! మళ్లీ జన్మంటూ ఉంటే సంప్రదాయాల పేరుతో హృదయాల్ని కట్టేసే కుటుంబాల్లో ఆడదానిగా పుట్టించకు." మౌనంగా రోదిస్తూ భగవంతుణ్ని వేడుకున్నాను.

* * *

తొలిరాత్రి గడిచిన తర్వాత మళ్లీ ఆర్నెల్లకి కాబోలు నా భర్త దర్శదర్శన భాగ్యం కలిగింది. రేసులు, ఫైవ్‌స్టార్ హోటల్స్‌లో విలాసాల్తో ఆయన చాలా బిజీగా ఉంటారు. మా రాతి భవంతుల వెనక ఆయన లోలత్వం, జారత్వం, నా ఆత్మ అన్నీ అణిగిపోయాయి. విపరీతమయిన దురభ్యాసాలకు లోనయి ఆయన ఆరోగ్యం హరించుకుపోతుంటే నా మొహంలో కళ మాయమయింది. ఈ భవంతిలో ఎవరికి నా గోడు విన్నవించుకోవాలో అర్థంకాలేదు నాకు. అత్తగారు, మరుదులు, వదినగార్లు ఎవరి జీవితం వారిదే. ఎవరి హుందాతనం వారిదే. ఎవరూ వారి పరిధిలోంచి బయటకు రారు. మరెవర్నీ తమ పరిధిలోకి రానివ్వరు. అభిజాత్యం ముందర అభిమానాలు, ఆప్యాయతలు వట్టిమాట. వాటి ఉనికి ఎప్పుడూ సందేహాస్పదమే.

కట్టుబాట్ల సంకెళ్లు లేని విలాస

జీవితం నా భర్తను కేన్సర్ రూపంలో నాకు దూరంచేసి నాకు వైధవ్యాన్ని మిగిల్చింది. నా భర్త శవంచుట్టూ కనీసం కంటతడి లేకుండా మౌనంగా కూర్చున్న నా బంధువుల్ని చూస్తుంటే మనుషుల పైన మనుషులికి అభిమానాలు, అప్యాయతలు ఉండటం నిజమేనా అన్న ప్రశ్న నాలో తలెత్తింది. నాలో ఎందుకో నిర్లిప్తత. అతనితో సాన్నిహిత్యం మృత్యువు నీడలా నా మంగళసూత్రాన్ని కబళిస్తే ఎదలో మిగిలిన సన్నని బాధ.

ఏదో మానసిక బీభత్సం మనసుని అల్లుకొంటే సదాచార శాస్త్రసిద్ధ మతాల్లారా! మీరు చచ్చిపోండి! మనసులోనే శపించాను.

ఎవ్వరిమీదా ద్వేషం లేదు. ప్రేమా లేదు.

ఆలోచన్లు చెదిరాయి. కారు జోరుగా పరిగెత్తుతోంది. నాన్నగారివైపు చూసాను. శిలావిగ్రహంలా గంభీరంగా ఉండే ఆయనలో హఠాత్తుగా ఆందోళన ప్రస్ఫుటించింది.

ఎదురుగా వేగంగా వస్తున్న లారీ.

ప్రమాదకరమైన మలుపులో స్టీరింగ్ ప్రక్కకు తిప్పారు నాన్నగారు. కారు లోయలోకి జారిపోతుండగా నాకు స్పృహ తప్పింది.

* * *

భారంగా కళ్లు తెరిచాను. చీకటి.... చీకటి.... ఏమీ కనిపించదేం? నుదురు స్పృశిస్తున్న ఏదో పరిచయమైన హస్తం ఎవరది? ఆయా!

"ఆయా!" పిల్చాను.

"ఏమిటమ్మా!"

"నా కేమిటోగా ఉంది. అంతా చీకటిగా ఉంది. నాన్నగారేరి?"

"ఫరవాలేదమ్మా! భయంలేదన్నారు డాక్టర్‌గారు. మరో రెండు మూడు నెలల్లో చూపొచ్చేస్తుందన్నారు. నాన్నగారు 'ఐ'బ్యాంకుకు వెళ్లారు.

'అంటే ప్రస్తుతం నేను అంధురాలన్నమాట.' మనసులో ఏ విధమైన గ్లాని లేదు. ఎందుకో చిత్రమైన ప్రశాంతత.

* * *

నెమ్మదిగా కళ్లు తెరిచాను. నా చుట్టూ డాక్టర్లు, నాన్నగారు, ఆయా! అందరూ నావైపే ఆత్రంగా చూస్తున్నారు.

చేతులెత్తి డాక్టరుగారికి నమస్కరించాను.

అందరి మొహాల్లో వెల్లివిరిసిన ఆనందం.

కొంచెంసేపుండి ఆయా తప్ప అందరూ వెళ్ళిపోయారు.

నెమ్మదిగా ప్రక్కకు ఒత్తిగిలి చూసాను. ప్రక్క బెడ్‌మీద రెండు కళ్లకు బాండేజీతో యువకుడు నల్లగా. ఎందుకో మనసు కీడు శంకించింది.

ఎవరు? ఎవరు?

ఆయా నెమ్మదిగా నా చెవిలో చెప్పింది.

"వంశీ!"

ఎందుకో భరించలేనంత దుఃఖం వచ్చింది.

తడబడుతున్న అడుగుల్తో అతన్ని సమీపించాను.

"ఎందుకు వంశీ! ఎందుకిలా చేసావ్! నీ కళ్ల వెలుగుకూడా నా కిచ్చేసి ఇక నీకేం మిగుల్చుకున్నావ్?"

చిన్నగా నవ్వాడు వంశీ.

"నా కళ్ళ వెలుగు నా ఆత్మలోనే దాచుకున్నాను బిందూ. నీ కిదివరకో సారి చెప్పాను గుర్తుందా. నేను స్వార్థిని. పట్టుచీరలో నుదుట సింధూర తిలకంతో పుత్తడిబొమ్మలా మెరిసిపోయే నిన్ను వైధవ్యంలో రంగు వెలిసిన బొమ్మలా చూడలేను. అలా చూసి భరించగల శక్తి నాకు లేదు...." వంశీ స్వరం జీరగా పలుకుతోంది.

ఏదో నిస్సత్తువ నన్నావరించుకుంది.

జీవంలేనిదానిలా నా బెడ్ వైపు కదిలాను.

* * *

వంశీకంటే ముందు నన్ను డిశ్చార్జి చేసారు.

మళ్లీ ఈ జీవితంలో అతన్ని చూడను. ప్రేమికురాలిగా అతన్ని కలుసుకోవటం వేరు. నా వైధవ్య జీవితంలో అతన్ని కలుసుకొంటే అందరి దృష్టిలో కామపూరితమైన కలియికలా మిగిలిపోతుంది. రాచరికపు రక్తం మనోనిగ్రహశక్తి కట్టుబాట్లకి తలవంచే ధైర్యం నాలోనూ ఉన్నాయి. గుండె నిబ్బరం చేసుకున్నాను.

బయట గుమ్మం దగ్గర నిల్చున్న నాన్నగారు నావైపు చూస్తున్నారు.

వంశీని సమీపించాను.

"వంశీ!" పిల్చాను.

"ఊఁ!" బరువుగా పలికాడు.

కొన్ని క్షణాలు అతని సమక్షంలో మూగదాన్నే అయిపోయాను. "వంశీ! మళ్లీ జన్మంటూ ఉంటే సదాచారమైన శాస్త్రయుత ఐశ్వర్యపు సంకెళ్ళకి అతీతంగా పుట్టి నిన్నే పెళ్ళిచేసుకుంటాను." గొంతులోనే మిగిలిపోయిన వేదన.

"వెళ్ళొస్తాను వంశీ" హీనస్వరంతో చెప్పాను.

మౌనంగా ఉండిపోయాడు వంశీ.

"రా బిందూ!" నాన్నగారు అసహనంగా పిలుస్తున్నారు.

నెమ్మదిగా వంగి వంశీ పాదాల్ని ముద్దుపెట్టుకున్నాను. నా కళ్ల నుంచి జారిపడిన నీటిబొట్లు అతని పాదాలమీద పడి హిమబిందువుల్లా మెరిసి నేలమీదకు జారి అస్థిత్వాన్ని నశింపజేసుకుంటున్నాయి. అతని పవిత్ర సన్నిధిలో ఆత్మని వదిలేసిన నా శరీరం యాంత్రికంగా రాతిగోడల మధ్యకి నాన్నగారి వెంట నడిచింది.

—